సాక్షి
కాకినాడ

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024

వైఎస్సార్‌కు నివాళి



కిక్కిరిసిన జాతీయ రహదారి



ఏలూరు.. జనహోరు



దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సార్వత్రిక పోరుకు 'సిద్ధం'

- ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం వైఎస్‌ జగన్‌
- జన సునామీని తలపించిన దెందులూరు సహారా గ్రౌండ్స్‌
- కోస్తాంధ్ర నుంచి లక్షలాది మంది రాక
- మండుటెండను సైతం లెక్కచేయని వైనం
- అంచనాలకు మించిన జనంతో కిక్కిరిసిన ప్రాంగణం
- పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపిన ముఖ్యమంత్రి ప్రసంగం
- ఏలూరు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సభ

సమరోత్సాహం

కృష్ణా, గోదావరి పరవళ్లు తొక్కినట్టుగా.. కొల్లేరు ఉప్పొంగినట్టుగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరిస్తూ ఏలూరు జిల్లా దెందులూరు వేదికగా నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభ జన సునామీని తలపించింది.. నేల ఈనిందా.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా పూర్వ ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జై జగన్‌.. జైజై జగనన్న నినాదాలతో మార్మోగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా మధ్యాహ్నం నుంచి ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకుని జననేత రాక కోసం ఎదురుచూశారు.

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల భేరీ మోగిస్తూ ఏలూరు జిల్లా దెందులూరులోని సహారా గ్రౌండ్స్‌ లో శనివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' భారీ బహిరంగ సభకు కోస్తాంధ్రలోని పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 50 నియోజకవర్గాల నుంచి వందలాది బస్సులు, వేలాది కారుల్లో లక్షలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఏలూరు చరిత్రలో ఇదే అతి పెద్ద సభ కావడం విశేషం. సీఎం జగన్‌ మధ్యాహ్నం 3.30 గంటలకు సభావేదిక వద్దకు రానుండగా గ్యాలరీల్లో కూర్చుని ఆయన్ను చూడాలన్న ఆశతో మండుటెండను సైతం లెక్కచేయకుండా మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవడం ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన గ్యాలరీలన్నీ జనంతో నిండిపోయాయి. గ్రౌండ్‌ ఖాళీ లేకపోవడం, అంచనాలకు మించి జనం రావడంతో మిగిలిన వారు సభా ప్రాంగణాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై నుంచి సభను వీక్షించారు. మధ్యాహ్న సమయంలో 33 డిగ్రీలకు పైగా ఎండ ఉన్నా ప్రజలు ఏమాత్రం పట్టించుకోకుండా సీఎం జగన్‌ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా దాహార్తిని తీర్చేందుకు ముందుగానే భారీ ఎత్తున గ్యాలరీల వద్ద చల్లటి మజ్జిగ ప్యాకెట్లను నాయకులు అందుబాటులో ఉంచారు.

18 నిమిషాల పాటు వాకింగ్‌వే పైనే..

మధ్యాహ్నం 3.45 గంటల సమయానికి సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం జగన్‌ వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరించారు. దివంగత వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నేరుగా సభా ప్రాంగణం మొత్తం కవర్‌ చేస్తూ ఫ్యాను ఆకారంలో ఏర్పాటుచేసిన వాకింగ్‌వే పైకి చేరుకున్నారు. పది నిమిషాల పాటు ప్రజలందరికీ అభివాదం చేస్తూ వాకింగ్‌వే మొత్తం తిరగడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ప్రసంగం అనంతరం కూడా ఆయన మరోమారు వాకింగ్‌వే మీదుగా జనం మధ్యలోకి వచ్చారు. ఎనిమిది నిమిషాల పాటు ప్రజలను పలకరిస్తూ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. ఈ క్రమంలో ఒక యువకుడు సెల్ఫీ కోసం వాకింగ్‌వే పైకి దూసుకురాగా సెక్యూరిటీ ఆపు చేసే ప్రయత్నం చేసింది. సీఎం జగన్‌ వారిని వారించి యువకుడిని నవ్వుతూ పలకరించి సెల్ఫీ దిగారు.

ప్రగతిని వివరిస్తూ.. కుట్రలను ఎండగడుతూ..

సీఎం జగన్‌ దాదాపు 70 నిమిషాల పాటు ప్రసంగించి 57 నెలల్లో కనీవినీ ఎరుగని రీతిలో పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి తెచ్చిన విప్లవాత్మక మార్పులు వివరిస్తూ.. ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలను ఎండగడుతూ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపారు. 'దిగజారుడు పార్టీలన్నింటికీ జగన్‌ టార్గెట్‌, పేదల భవిష్యత్‌ టార్గెట్‌, సంక్షేమం టార్గెట్‌.. వారితో యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా..' అని సీఎం జగన్‌ అన్నప్పుడు 'ఎంతమంది కలిసొచ్చినా ఎదురించేందుకు మేం సిద్ధం' అంటూ ప్రజలు నినదించారు. 'కౌరవ సేనను మరలా ఓడించేందుకు.. మరో గొప్ప విజయం సాధించేందుకు మీరు సిద్ధమా' అని సీఎం జగన్‌ అన్నప్పుడూ 'మేము సిద్ధమే' అంటూ గొంతెత్తారు. సీఎం జగన్‌ ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో యువకులు, మహిళలు, అభిమానులు మద్దతు పలికారు. ప్రజల ఉత్సాహం చూసి ముఖ్యమంత్రి సైతం చిరునవ్వుతో అభివాదం చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయకపోగా అవినీతి, అభూత కల్పనతో పాలన సాగించారని విమర్శించినప్పుడు 'నిజం' అంటూ ప్రజలు మద్దతు తెలిపారు. దుష్టచతుష్టయానికి దత్తపుత్రుడు తోడయ్యాడు.. ఒక్కరూ ఇక్కడ ఉండరూ అంతా నాన్‌ రెసిడెంట్‌ ఆంధ్రాస్‌ అన్నప్పుడు 'అవును' అంటూ గొంతు కలిపారు. ఇలా ఆద్యంతం సీఎం ప్రసంగం కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. సిద్ధం సభలో సీఎం ప్రోగ్రామ్స్‌ కో-ఆర్డినేటర్‌, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌, శాసనమండలి చైర్మన్‌ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, జోగి రమేష్‌, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్‌, ఎంపీలు నందిగం సురేష్‌, కేశినేని నాని, మార్గాని భరత్‌, కోటగిరి శ్రీధర్‌, చింతా అనురాధ, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వంగా గీత, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, కురసాల కన్నబాబు, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, ప్రభుత్వ విప్‌ గ్రంధి శ్రీనివాస్‌, ముదునూరి ప్రసాద రాజు, చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు కౌరు శ్రీనివాస్‌, జయమంగళ వెంకటరమణ, తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, దూలం నాగేశ్వరరావు, తెల్లం బాలరాజు, మేకా వెంకటప్రతాప్‌ అప్పారావు, పుప్పాల వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నరసింహరాజు, ఏలూరు, నరసాపురం పార్లమెంట్‌ సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్‌ యాదవ్‌, గూడూరి ఉమాబాల, పాలకొల్లు, చింతలపూడి సమన్వయకర్తలు గుడాల గోపి, కంభం విజయరాజు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



సిద్ధం సభకు బయలుదేరుతున్న బస్సులను అమలాపురం మండలం నడిపూడి వద్ద జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌



రాజమహేంద్రవరం రూరల్‌ నియోజకవర్గం నుంచి సిద్ధ సభకు బయలుదేరుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం నుంచి దెందులూరు సభకు బయలుదేరుతున్న వాహనాలకు జెండా ఊపుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ తదితరులు



దెందులూరు సభకు హాజరైన రాజానగరం నియోజకవర్గ కార్యకర్తలతో ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



అభిమాన తరంగం.. వాకింగ్‌ వేపై నడుస్తూ అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



మేము సైతం సిద్ధం



విజయమే లక్ష్యంగా..

తీన్‌మార్‌ నృత్యాలతో జోష్‌

యువకులు తీన్‌మార్‌ నృత్యాలు చేసుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సిద్ధం, సీఎం జగన్‌ ఫ్లకార్డులతో సభాప్రాంగణం వద్ద యువత ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. సభ ప్రారంభానికి ముందు సీఎం జగన్‌ పాలనలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని వివరిస్తూ ప్రముఖ కళాకారిణి వంగపండు ఉష బృందం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 'గిరా గిరా తిరుగుతుంది ఫ్యాను.. ఆయ్యా నేను జగనన్న ఫ్యాను' పాట ప్రాంగణంలోని వారిలో ఫుల్‌జోష్‌ నింపింది. యువకులు ఉత్సాహంగా కుర్చీల్లోంచి లేచి స్టెప్పులు వేసి కేరింతలు కొట్టారు. మధ్యాహ్నం 3.40 గంటల సమయానికి సభావేదిక సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ వద్దకు సీఎం జగన్‌ హెలికాప్టర్‌ చేరుకుంటున్న సమయంలో సభలోని జనం అంతా పైకి లేచి చేతులు ఊపుతూ స్వాగతం పలికారు.

ప్రగతిలో పెద్దాపురం

- మున్సిపాలిటీలో అభివృద్ధి బావుటా
- వైఎస్సార్ సీపీ పాలనలో సమస్యలన్నీ పరిష్కారం
- తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల్లో భేష్
- 'నాడు– నేడు'తో పాఠశాలలకు మహర్దశ

పెద్దాపురం మున్సిపాలిటీ ఆవిర్భావం: 1915	
విస్తీర్ణం	: 41.13 చదరపు కిలోమీటర్లు
మొత్తం వార్డులు	: 29
జనాభా	: 49,579
పురుషులు	: 24,406
మహిళలు	: 25,173
గృహాలు	: 11,500
ఓటర్లు	: 40,790



పెద్దాపురంలో సుందరంగా టిడ్కో గృహ సముదాయం

పెద్దాపురం: చెత్త దారులు.. మురుగు వెతలు.. నీరు రాల్చని పైపులైన్లు.. ఆహ్లాదం పంచని పార్కులు.. శిథిలావస్థలో బడులు.. పేదలకు గూడు లేక అవస్థలు.. గత టీడీపీ పాలనలో పెద్దాపురం పట్టణంలో పరిస్థితి ఇది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని అడ్డంకులను అధిగమించి పాలకులు ముందుకెళ్లారు. పట్టణాన్ని ప్రగతి పథాన తీసుకెళ్లారు.. పేరులో ఉన్నట్టే ప్రగతిలో 'పెద్దా'పురం అనేట్టు తీర్చిదిద్దారు. ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. చెత్త'శుద్ధి'తో పట్టణాన్ని సుందరంగా తయారుచేశారు. విద్యార్థులు సంబర'బడి' వచ్చేలా పాఠశాలల రూపురేఖలు మార్చారు. తాగునీటి సమస్యలకు చెక్ పెడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బాటలు వేశారు. పెద్దాపురం మున్సిపాలిటీలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూద్దాం రండి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండో మున్సిపాలిటీగా పెద్దాపురం మున్సిపాలిటీ ఆవిర్భవించింది. ఇక్కడ 50 పడకల ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు ఎనిమిది ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నారు. ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు 24 మున్సిపల్ పాఠశాలలు, 26 ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు ఆసరాగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణం అన్ని రంగాల్లో వెనకబాటును ఎదుర్కొంది. ఎక్కడికక్కడే సమస్యలతో ప్రజలు విసిగిపోయారు. ఈ నేపథ్యంలో సుమారు ఐదేళ్ల కిందట వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణ ప్రగతికి ఊహించని బాటలు వేసింది. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో 29 వార్డులకు 27 వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో మరింత సహకారం తోడైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నాడు–నేడు' కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. ఈ పథకంలో రూ.4.50 కోట్లతో మున్సిపల్ పాఠశాలల అభివృద్ధి పనులు జరిగాయి. పాఠశాల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో మధ్యాహ్న భోజనాన్ని అత్యంత నాణ్యతగా అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తుండడంతో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

అన్నింటా అగ్రాసనం

పెద్దాపురంలోని వాలుతిమ్మాపురం రోడ్డులో 3,312 మందికి టిడ్కో గృహాలను నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. అయితే పనులను అసంపూర్తిగానే వదిలేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ పనులను తన భుజస్కంధాలపై వేసుకుంది. ఈ గృహాలను పూర్తి చేసేందుకు రూ.221 కోట్లు కేటాయించి సకల సౌకర్యాలు కల్పించింది. సుమారు రూ.20 కోట్లతో టిడ్కో గృహ సముదాయాల వద్ద రోడ్లు, డ్రైన్లు నిర్మించింది.

- గత ప్రభుత్వాలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థానిక సూరంపాలెం రోడ్డులో 2,550 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇందులో ఇప్పటికే 1,400 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సొంతింటి కల సాకారం చేసుకున్నారు. ఆయా పేదల కాలనీల్లో వీధి దీపాలు, మంచినీటి సౌకర్యాల కల్పనకు రూ.2 కోట్లు కేటాయించడంతో పనులు చేశారు.
- వైద్య సేవలు ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో స్థానిక పాత ఆసుపత్రి, బంగారమ్మ గుడి వీధుల్లో రూ.2 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు.
- సుమారు రూ.పది లక్షలతో ప్రధాన రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా రెండు చిల్డ్రన్ పార్కులను అభివృద్ధి చేశారు. మరింత అభివృద్ధికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు చేశారు.
- పట్టణంలోని 29 వార్డుల్లో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.6.30 కోట్లతో తాగునీటి పైపులైన్లు, డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించారు. అంతేకాకుండా అధ్వాన రోడ్ల అభివృద్ధికి మరో రూ.4.05 కోట్లతో పనులు చేస్తున్నారు.
- పెద్దాపురం మున్సిపాలిటీలో 14 సచివాలయాలు ఏర్పాటు చేయగా 107 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, స్థానికంగా నెలకొల్పిన పరిశ్రమల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు లభించడంతో యువత ఎంతో ఆనందంగా ఉన్నారు.


టీడీపీ హయాంలో సాగర్ మున్సిపల్ స్కూల్ (నాడు)


వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేశాక.. (నేడు)

కార్పొరేట్‌కు దీటుగా విద్య



గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగిస్తుంది. పట్టణం ప్రగతి సాధించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక నిధులు కేటాయించారు. ప్రతి ఇంటి వద్దకే సంక్షేమాన్ని తీసుకొచ్చారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించారు. నాణ్యమైన విద్య అందిస్తున్నారు.

–తాడి కస్తూరి, సామాజిక కార్యకర్త, పెద్దాపురం

పార్టీల రహితంగా పథకాలు



మున్సిపాలిటీ పరిధిలో అర్హులందరికీ పార్టీల రహితంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయారు. ప్రస్తుతం ప్రజల వద్దకే పథకాలు రావడంతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అగ్రపథాన నిలుపుతుంది.

–నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్, పెద్దాపురం

సంక్షేమమే విజయానికి నాంది



పెద్దాపురం అభివృద్ధికి అనేక కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. ఎన్నడూ లేని విధంగా అందరికీ సంక్షేమం దరిచేరింది. ప్రజా రవాణాకు రోడ్లు, మురుగు సమస్య తీర్చేందుకు డ్రైన్లు నిర్మించాం. గతంలో జరగని అభివృద్ధిని నేడు చేసి చూపించాం. అదే వైఎస్సార్ సీపీ విజయానికి నాందిలా నిలుస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

–బొడ్డు తులసీ మంగతాయారు, మున్సిపల్ చైర్‌పర్సన్, పెద్దాపురం

రత్నగిరిపై భక్తుల రద్దీ

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. వ్రతాలు 1,200 నిర్వహించారు. 4 వేల మంది భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు. కాగా, సత్యదేవుడు, అమ్మవారి ప్రాకార సేవను ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.

11.50 కిలోల బంగారంతో ఆలయ శిఖరం స్వర్ణమయం

అన్నవరం: సత్యదేవుని ఆలయ శిఖరాన్ని స్వర్ణతాపడం చేయనున్న విషయం తెలిసిందే. దీనికి ఎంత బంగారం అవసరమవుతుందో అంచనా వేసేందుకు ఎండోమెంట్స్ ప్రధాన స్తపతి పరమేశ్వరప్ప శనివారం అన్నవరం దేవస్థానానికి వచ్చారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్‌తో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. అనంతరం దేవస్థానం ఈఈ నరసింహారెడ్డితో కలిసి ప్రధాన ఆలయాన్ని, ఆలయ శిఖరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆలయ శిఖరాన్ని స్వర్ణమయం చేసేందుకు సుమారు 11.50 కేజీల బంగారం అవసరమవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. ప్రస్తుత ఉన్న బంగారం ధర ప్రకారం దీనికి సుమారు రూ.7 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశామన్నారు. దాతల విరాళాలతో ఆలయాన్ని స్వర్ణమయం చేయనున్నట్టు తెలిపారు. కాగా, ఆలయాన్ని స్వర్ణమయం చేసేందుకు దాతల నుంచి విరాళాలు కోరుతూ దేవస్థానం అధికారులు ఇప్పటికే ప్రత్యేక అకౌంట్ తెరిచారు. ఆలయ శిఖరాన్ని స్వర్ణమయం చేసేందుకు పూర్తి సొమ్ము భరించి, ఎవరైనా దాత ముందుకు వస్తే అవకాశం ఇస్తామని అధికారులు తెలిపారు.